## 27. కలలూ, ఫ్లాష్‌బ్యాక్‌లూ

"కెవ్వున కేకవేసి ఆమె పక్కమీంచి లేచింది" అని సోమర్‌సెట్‌మామ్ అనే రచయిత ఒక నవలను ప్రారంభించాడు. అది అతని మొదటి నవలల్లో ఒకటి. ఆ తర్వాత అతను చాలా నవలలు రాసి ప్రపంచ ప్రఖ్యాతి సంపాదించేక ఎవరో అతన్ని ఇంటర్‌వ్యూ చేస్తూ "ఆ నవల మీరు అలా మొదలెట్టేరేమిటి?" అని అడిగారు. దానికి సోమర్సెట్ మామ్ ఇచ్చిన వివరణ తాత్పర్యం ఇలా వుంది.

నవల గాని, కథ గాని 'ఏక్షన్'తో ప్రారంభిస్తే మంచి ఫలితాలు వస్తాయి. "అనగా అనగా ఒక రాజు" అనీ; "వన్స్ అపానెటైమ్-" అనీ కథలూ, నవలలూ ప్రారంభించకూడదు. నవల ప్రారంభవాక్యం ఇలా రాయడం వల్ల చదివేవాళ్ల మనస్సుల్లో ఎన్నో ప్రశ్నలు క్షణంలో ఉత్పత్తి అవుతాయి.

ఆమె ఎందుకు కెవ్వున కేకవేసింది?

పక్కమీంచి లేచింది కదా; ఆ పక్కమీద ఆమె కాక మరొకరెవర్లైనా ఉన్నారా? లేవక ముందు ఆమె పక్కమీద నిద్రపోతోందా, లేక?

అది రాత్రా, పగలా?

ఆ పక్క తన ఇంట్లో వేసుకున్నదా, లేక మరెక్కడిదైనానా?

చదువరి ఇంక ఆ ప్రశ్నలకి సమాధానాలు తెలిస్తే తప్ప అక్కణ్ణించి వెళ్లలేని నిస్సహాయ పరిస్థితిలో పడిపోతాడు. ఆ నవలకొనో, అద్దెకి తీసుకొనో చదవాలన్న ప్రలోభంలో పడిపోతాడు. అదంతా రచయితకు లాభమే. కనక, నవలగాని, కథగాని, "తొల్లి మగధ దేశంబున నుగ్రసేనుడను రాజుండెను" అని ప్రారంభించకూడదు.

నా ఫ్రెండు సాదరు బాదరాయణ రావని ఉండేవాడు. "ఉండేవాడు" అన్నాను కదా అని "ఇప్పుడు లేడు" అనుకోవద్దు. ఇప్పుడు కూడా సదరు సాదరు బాదరాయణరావు ఉన్నాడు. ఆ మాట "ఫ్రెండు" అనే దానికి అన్వయించుకుంటే అన్యాయం జరుగుతుంది. అతనిపుడు నా ఫ్రెండుగా కాక పొరవిడిచిన పాములా "పవర్‌ఫుల్"గా ఉన్నాడని సారాంశం.

సాదరు బాదరాయణరావు కథలూ, నాటికలూ, నవలలూ, నాటకాలూ రాసేటప్పుడు సోమర్‌సెట్ మాం సిద్ధాంతాన్ని మరింత పటిష్ఠంగా అమలుచేసేడు. (రచన ఆద్యంతం సోమర్‌సెట్‌మాం రచనలాగా ఉత్సాహంగా విజ్ఞాన స్ఫోరకంగా ఉండకపోయినా ప్రారంభవాక్యాలు డబల్ మీనింగులతోనూ డజన్లకొద్దీ కొశ్చన్లు ఉత్పన్నం చేసే విధంగానూ అలరారుతూ ఉండేవి.) అతను తన నవలల ప్రారంభ వాక్యాలుగా ప్రయోగించిన కొన్ని

"నాక్కావలసింది నువ్వే తప్ప నీ గత చరిత్ర కాదు సావిత్రీ!" .... అన్నాడు రాజారావ్.

"మన పెళ్లి జరగడానికి మా అమ్మానాన్నల కథే మనకి ఆటంకం కావచ్చు రాధా!" .... అన్నాడు వెంకటేశ్. (ఒక్క వాక్యంతో, వెంకటేశ్ తన తల్లిదండ్రుల పూర్వ చరిత్ర - బహుశా పాతికేళ్ళకిందటి కులాంతర ప్రేమవివాహ సంస్కరణాత్మక గాథ .... ఓ యాభైపేజీల వరకు చెప్పే అవకాశాన్ని సాధించాడు మా సాదరు బాదరాయణరావు.) ఈ ఫ్లాష్‌బ్యాక్ అయిపోగానే అసలు రాధా వెంకటేశ్‌లు తొలిసారిగా ఎక్కడ కలుసుకున్నారు. అదంతా చెప్పూ!

"నన్ను మొదటిసారి చూచినపుడు ఎలాగున్నది?" అని ఒక డ్యూయెట్ పాటకీ;

"ఏమో ఏమో ఐనది, నా కేమొయేమొ ఐనది!" అని రాధ బాధపడుతూ మెత్తటి పరుపు మీద నిద్దర పట్టకుండా దొర్లడానికీ కలలు కనడానికీ - అవకాశం సృష్టిస్తాడు.

సాదరు బాదరాయణరావుని ఎవరో సినిమా రంగానికి లేవదీసుకుపోతారని ఎప్పుడో వూహించేను. ఎందుకంటే ఫ్లాష్‌బ్యాక్‌ల ఊహ ఎంత పకడ్‌బందీగా చేస్తాడో డ్రీమ్ సీక్వెన్సులు కూడా అంత బందోబస్తుగా ప్లాన్ చేసేవాడు. ఆమధ్య ఎవరో సినిమా ప్రొడ్యూసరు ఇతని ఊహాశక్తి గురించి విని, సీతాకళ్యాణం సినిమా తీస్తూ సాదరు బాదరాయణరావుకి కబురు చేసేడు. ఇతను చెప్పిన సలహాల ప్రకారం సినిమా తీసేడాయన. తాటకిని చంపి; విశ్వామిత్రుడి యాగం పాడుచేస్తున్న మారీచ సుబాహుల్ని దూరంగా తరిమేసి అహల్యకి విముక్తి కలిగించి, లోకోద్ధరణ ప్రారంభించేరు. రామలక్ష్మణులు. అప్పుడు సీతకి పెళ్లి తలపెట్టేమని ఎడ్వర్టయిజుమెంటు విని విశ్వామిత్రుడు వీళ్లిద్దర్నీ తీసుకొని మిథిలానగరానికి ప్రయాణమయ్యేడు. రాముడూ, లక్ష్మణుడూ రాజవీథిలో నడుస్తూ వుండగా సీత మేడమీంచి చూసి -

"ఎంత సొగసుగాడే! మనసింతలోన దోచినాడే" అని స్వగతంగా పాడుకున్న సంగతి విశ్వామిత్రుడు దివ్యదృష్టిచేత గ్రహించి ఆ రాత్రి నిద్రపోతున్నపుడు కలగన్నాడట. ఎలాగంటేను, సీతాదేవి, శ్రీరామచంద్రుడు రహస్యంగా వుద్యానవనంలో కలుసుకున్నారు. "ఐ లవ్యు సీతా" అంటే "ఐ కెన్ లవ్యు రామా, బట్ ముందు శివ ధనుస్సు విరిస్తే .." అని అనుకున్నారుట. "ఓకే -" అని రాముడు సీతకి నచ్చజెప్పి ఒక పాట అందుకున్నాడు. ఇక అక్కణ్ణుంచి హిమాలయ పర్వతాల్లో సగం డ్రస్సులతోనూ, కేరళా కొండల్లో మరింత తక్కువ డ్రస్సులతోనూ, నల్లమలా దండకారణ్యాల్లో పూర్తి డ్రస్సులతోనూ ఆ డ్యూయెట్ సాగుతుంది. ఆఖర్ని సీత, రాముడు సైలంట్‌వేలీ దగ్గర ఒకర్నొకరు కౌగలించుకొని దొర్లుకుంటూ వుండగా విశ్వామిత్రుడికి మెలకువ వచ్చిందట. ఇదంతా (అంటే, ఈ డ్యూఎట్, ఈ డ్రస్సులూ గొడవంతా) రామాయణంలో లేదని పత్రికలన్నీ గొడవ పెట్టేయిగాని రాముడు, సీత పాత్రలు ధరించినవాళ్ల అభిమాన సంఘాలు రంగంలోకి దిగి పిక్చర్ని వందేసి రోజులు ఆడించాయి.

"ఏమయ్యా బాదరాయణరావూ, ఆ కల సీక్వెన్సు పెట్టడం తప్పుకాదటయ్యా?"

అని అడిగాను. "రాముడుకో, సీతకో అలాంటి కలవస్తే తప్పుగాని, విశ్వామిత్రుడు ఎన్టీఆర్ లాగా అహంభావి, మిస్చీవస్ ఫెలో. కనక అతనికి ఎలాంటి కలైనా రావచ్చు. పైగా, రాముడూ సీతా ప్రేమించుకున్నారని విశ్వామిత్రుడి కల ద్వారా ప్రేక్షకులకి రిజిస్టర్ అయింది కదా?" అన్నాడు బాదరాయణరావు.

మళ్లీ మొన్న బొంబాయి వెళ్లేడంటే ఏం చేస్తాడో, ఈ మాటు ఏ పురాణానికి నిప్పంటిస్తాడో అని భయపడుతూనే ఉన్నాను. భయపడ్డందుకు అంతా అయింది. ఈ మారు కూడా విశ్వామిత్రుడే సబ్జక్టు.

"అది కాదయ్యా, నువ్వేటగా సలహాదారు?" అన్నాడు.

"ఆ, నేనే. ఏం?" అన్నాడు బాదరాయణరావు.

"తపో భంగం కోసం ఇంద్రుడు విశ్వామిత్రుడి మీదికి ప్రయోగించిన మేనక నల్లపూసలూ, మంగళసూత్రం మట్టెలూ తగిలించుకొని కాపరం చేసిందనీ, దీర్ఘకాలం విశ్వామిత్రుడు తపస్సు మానేసి సంసారంలో మునిగిపోయేడనీ చూపించమన్నావుట. పోనీ, ఆ ఊపులో మేనక ప్రియకీ శకుంత ప్రియకీ అవకాశం ఇప్పించేవు. అలా భరతుడు, శంతనుడు, భీష్ముడు, దాశరాజు, మత్స్యగంధీ - అలా వెళిపోతే బాగుండేది కదా, మళ్ళా త్రేతాయుగంలోకి వెనక్కి వెళ్ళి హరిశ్చంద్రుడూ, లోహితాస్యుడు, నక్షత్రకుడూ అంటూ మొదలెట్టమన్నావట - ఇదంతా ఎందుకు?"

"అక్కడే వుంది మజా. ఫ్లాష్‌బ్యాక్ ఉంటేనే సినిమాకి రక్తి. ఇరవై ఏళ్ల ముప్పయ్యేళ్లా ఫ్లాష్‌బ్యాక్‌లు అందరూ తీస్తారు. నేను గనకా ఒక యుగం ఫ్లాష్‌బ్యాక్ చేసేను."

"ఇలా పురాణాలన్నీ నీ ఇష్టం వొచ్చినట్లు కిందా మీదా పెట్టి మార్చేస్తున్నావే, ఎవడికైనా కోపం వచ్చి నిన్ను తంతాడేమో, జాగర్తగా ఉండు!" అని చెప్పేను.

"ఆ భయం మనకేం లేదు. మనది హిందూమతం. ఇండియాలో మనదే మైనారిటీ. ఇంకే మతం వాళ్ల గ్రంథాలనైనా అవమానం చేస్తే తన్నడం, మరణశిక్ష వెయ్యడం జరగొచ్చు గాని మనకా భయం లేదు. ఇతర మతాల వాళ్లు పండుగలూ, ఉత్సవాలూ వేసుకుంటే మెచ్చుకోవడం సెక్యులరిజం అవుతుంది. మన మతంలో విశ్వాసాల్ని బట్టి నడిస్తే కమ్యూనలిజం అవుతుంది. ఆ తేడా తెలిసినన్నాళ్లూ మనం ఎలాంటి వూహలయినా చేసి కలలూ, ఫ్లాష్‌బ్యాక్‌లూ పెట్టుకోవచ్చు. హిందువులకి మతం విషయంలో కూడా రాజకీయ నాయకులే కాపలాదార్లు. అంచేత ఎవరైనా ఆగ్రహిస్తారన్న ప్రశ్నే లేదు" అని వివరించేడు సాదరు బాదరాయణరావు.

*('ఆంధ్రభూమి' డెయిలీ : 3-1-90)*